www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 11 అక్టోబరు 2023
5

వేతన బకాయిలు చెల్లించాలని విద్యావాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాతృ భాషా విద్యా వాలంటీర్ల నాలుగు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఐటిడిఎ వద్ద నిరసన దీక్షను మంగళవారం చేపట్టారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంజా నవీన్ మాట్లాడుతూ 2019 నుండి ఐటిడిఏ పరిధిలోని 101 పాఠశాలల్లో మాతృ భాష విద్యను వాలంటీర్లు బోధిస్తున్నారన్నారు. 2021-2022లో కొన్ని నెలల వేతన బకాయిలతో పాటు, 2023 విద్యాసంవత్సరంలో రెండు నెలల వేతన బకాయిలున్నాయన్నారు. బకాయి వేతనాలు నేటికీ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి, మాతృ భాషా విద్యా వాలంటీర్లు కిసరి రామకృష్ణ, మడకం కృష్ణవేణి, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరి, సాగర్, అరుణ, గీతా మహాలక్ష్మి గీతాంజలి పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వివిధ పేర్లతో పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించి వినియోగదారులపై భారం మోపడాన్ని ఆపాలని, 2020 కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏలూరు మున్సిపల్ ఆఫీస్ వద్ద సంతకాల సేకరణ ప్రారంభించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య ప్రసంగిస్తూ ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతూ, ఇబ్బంది పడుతున్న ప్రజలపైన విద్యుత్ ఛార్జీల భారాలు మోపడం దారుణమని వారు ఆరోపించారు. బిజెపి తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయకముందే మన రాష్ట్రంలో సిఎం జగన్ హడావుడిగా అమలు చేస్తూ విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. ఆరు రూపాల్లో విద్యుత్ భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. 2014లో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు వసూలు చేయడం దారుణమని విమర్శించారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్లు బిగించి, ఫోన్ రీఛార్జి లాగా ప్రీపెయిడ్ రీఛార్జ్ చేసుకుంటే గాని విద్యుత్ వాడుకోలేని విధంగా కొత్త విధానం తీసుకొస్తున్నారని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని వారు తెలిపారు. ఈ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ పది వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫ్లెక్సీపై సంతకాలు చేసి ప్రారంభించారు. అనేకమంది సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు బి.సోమయ్య, బి.జగన్నాధరావు, వి.సాయిబాబు, వివిఎన్.ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, మంగం అప్పారావు, డి.వీరినాయుడు పాల్గొన్నారు.

ఏలూరులో..

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి చల్లారి మాణిక్యాలరావు, సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంగా గోపి, ఆరేటి రామచంద్రరావు, ఎస్‌కె.మహబూబ్‌సుభాని, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కమిటీ సభ్యులు గొలిమే బాలఏసు, తాళ్లూరి నాగరాజు, హనుమంతు, గట్టయ్య, ఆశీర్వాదం, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని కోరుతూ సిపిఐ, సిపిఎం, వివిధ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొయ్యలగూడెం పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కట్టా మహాలక్ష్మయ్య, ఆకుల దుర్గారావు, కడియం సీతారాములు, ఎస్.శివకుమార్, ఇ.గోపి, రాచూరి దుర్గారావు, మర్రి త్రిమూర్తులు, పిల్ల తంబారావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కలెక్టరేట్ వద్ద నిద్రిస్తున్న వెలుగు ఉద్యోగులు

వెలుగు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని

కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా

'వంటా-వార్పు' చేసి నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెలుగు విఒఎ, మెప్మా ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు విఒఎ, (సిఐటియు), మెప్మా ఆర్‌పిల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా, వంట – వార్పు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి విఒఎలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో వంట చేసుకుని మధ్యాహ్నం, రాత్రి భోజనాలు చేశారు. రాత్రి కలెక్టరేట్ వద్ద నిద్రించారు. మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, గ్రేడింగ్ పద్ధతి వెనక్కి తీసుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూపుల విలీనం ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తానని చెప్పిన సిఎం మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ తీసుకువచ్చి విఒఎలు, ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ విభాగాల్లో లేనివిధంగా కేవలం వెలుగు విభాగంలో మాత్రమే కాలపరిమితిని ప్రవేశపెట్టారని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర, వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ మెప్మా ఆర్‌పిల గ్రేడింగ్ పద్ధతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విఒఎ, ఆర్‌పిలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూపుల విలీనం పేరుతో విఒఎలను తగ్గించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. విఒఎ, అర్‌పిలకు గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సూపర్ మార్ట్‌ల పేరుతో విఒఎలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ధర్నా నిర్వహిస్తుంటే జిల్లా అధికారులు బెదిరించడం భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్చలు జరపాలని, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సంఘీభావంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సోమయ్య, వి.సాయిబాబు, జై.గోపి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి నాయకులు ఎం.ఆమని, మేరీ, కృష్ణకుమారి, లక్ష్మీ, కృష్ణవేణి, ఝాన్సీ, మరియమ్మ, కనకమ్మ, విజయకుమారి నాయకత్వం వహించారు.

వంటా-వార్పు చేస్తున్న ఉద్యోగులు

రైతులతో మాట్లాడుతున్న వీరపాండ్యన్

ధాన్యం సేకరణ వాహనాలకు జిపిఎస్ ట్యాగ్

సివిల్ సప్లయీస్ ఎమ్‌డి వీరపాండ్యన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇకమీదట ధాన్యం సేకరణ వాహనాలకు జిపిఎస్ ట్యాగింగ్ చేసి ట్రాకింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ విసిఅండ్ఎమ్‌డి జి.వీరపాండ్యన్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు, రైతుల నుంచి సమగ్ర వివరాలను తెలుసుకునేందుకు ఆయన మంగళవారం మండలానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వెల్లమిల్లి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. జిపిఎస్ ట్రాకింగ్ విధానాన్ని పరిశీలించామని, కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు చేరే వరకూ వాహనాన్ని ట్రాకింగ్ చేస్తామని తెలిపారు. అనంతరం ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి వీరపాండ్యన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా సిబ్బందికి దిశానిర్దేశం చేశామన్నారు. రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా అధికారులకు తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన తేమ శాతం, తూకం యంత్రాలను, డేటా ఎంట్రీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించి, అధికారులు సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఫిర్యాదులు చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి కంట్రోల్ రూము ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను ఎప్పటికప్పుడు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు మంజు భార్గవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు

ధాన్యం సేకరణలో ప్రధానంలో గన్నీ బ్యాగులు, లారీ, రవాణా వంటి ప్రణాళిక ఖచ్చితంగా అధికారుల వద్ద ఉండాలని, దీనికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జి.వీరపాండ్యన్ అన్నారు. మంగళవారం రాత్రి ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో ధాన్యం సేకరణకు సంబంధించి జిల్లాస్థాయి అధికారులు, మిల్లర్లతో ఆయన సమీక్షించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం తేమ, బ్రేకింగ్ శాతం ఎంత ఉందో మిల్లర్ల వద్ద కూడా అంతే ఉండేలా పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి అందులో సీనియర్లను కస్టోడియన్ అధికారులుగా నియమించాలని ఆదేశించారు. ఖరీఫ్‌లో ఈ నెల 20 నుంచి ధాన్యం సేకరణ మొదటిసారిగా ఉంగుటూరు మండలంలో ప్రారంభించాలని ఆదేశించారు. రైతుల నుండి ధాన్యం వివరాలు నమోదు చేసినప్పుడే గోనె సంచుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ వాహనానికి జిపిఎస్ డివైజ్ అమర్చిన వాటిలోనే ధాన్యం రవాణా చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యం : బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా స్వర్ణవారిగూడెం పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాములవారిగూడెం, స్వర్ణవారిగూడెం గ్రామాల్లో ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. అదే విధంగా ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురులు వైసిపిలో చేరారు. అనంతరం స్వర్ణవారిగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించే డ్రెయినేజీ నిర్మాణానికి, రూ.40 లక్షలతో చేపట్టే సచివాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రైతు భరోసాకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, వైస్‌ఎంపిపి సోమగాని శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు సందా ప్రసాద్, ఎంపిటిసి సున్నం సురేష్, ఎఎంసి డైరెక్టర్ బోదా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, ఎంఇఒ శ్రీనివాస్, వైసిపి నాయకులు గూడవల్లి శ్రీనివాస్, కుంజ రాముడు, రాంపండు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల దీక్ష విరమణ

జీతాలు చెల్లించేందుకు అధికారుల హామీ

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల రిలే నిరాహార దీక్షలకు ఉన్నతాధికారులు స్పందించారు. డిఇఒ శ్యామ్‌సుందర్, మున్సిపల్ కమిషనర్ మంగళవారం సాయంత్రం దీక్షాశిబిరానికి చేరుకుని స్వీపర్ల బకాయి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఎనిమిది రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలను విరమించారు. వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ఐదు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ ఈనెల మూడో తేదీన డిఇఒ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వీరికి వివిధ కార్మిక, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పెద్దఎత్తున మద్దతు తెలిపాయి. దీనిపై స్పందించిన అధికారులు జీతాలు చెల్లించేందుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆందోళనకారులకు రాతపూర్వక ఉత్తర్వుల కాపీని అందజేశారు. దానిని మున్సిపల్ కమిషనర్ అమలు చేసేందుకు అంగీకరించారు. ఈ హామీ ప్రకారం గత ఎనిమిది రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకున్న కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖ అధికారికి, మున్సిపల్ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న డిఇఒ

ఎనిమిదో రోజు రిలే నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య ప్రారంభించారు. ఈ దీక్షలో మాధవి, లక్ష్మీ, సుజాత, ప్రమీళ, దుర్గా భవాని, రామలక్ష్మి, నూర్జహాన్, యాస్మిన్, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, స్వాతి, ప్రియాంక, భారతి, పార్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం సహించేది లేదు : కలెక్టర్

డిసెంబరు నాటికి 25 వేల ఇళ్లు పూర్తిచేయాలని ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధనలో అలసత్వాన్ని సహించేది లేదని సంబంధిత అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల నిర్మాణ ప్రగతి, డిసెంబరు 2023 నాటికి నిర్దేశించిన 25 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసే అంశాలపై గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, డివిజన్ హెడ్ అధికారులు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఇళ్ల ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధనలో ఏమైన సమస్యలుంటే తెలియజేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు సూచించారు. వారు తీసుకువచ్చిన పలు సమస్యలకు అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల ప్రగతిసాధనలో షోకాజ్ నోటీసులు ఇప్పించుకునే పరిస్థితులు తెచ్చుకోకుండా లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి విషయం గురించి తమ వెనక పడకపోతే పనిచేయరా అని కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడకుండా కుంటిసాకులు చెబితే సహించేది లేదన్నారు. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి వారు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతి సాధించడంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే వాటిని ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. మండలస్థాయిలో ప్రతి శనివారం ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ తదితరులు సమావేశమై మండలంలో గృహనిర్మాణాల ప్రగతిలో పురోగతి సాధించాలన్నారు. ఇళ్ల లేఅవుట్లలో నీటిసరఫరా, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాల ప్రగతిపై కలెక్టర్ సమీ క్షించారు. డిసెంబరు 2023 నాటికి 25 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసే విషయంపై పూర్తి శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమా వేశంలో గృహనిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి జిల్లా అధికారి డాక్టర్ ఆర్. విజయరాజు, గ్రామీణ నీటిపారుదల ఎస్ఇ సత్యనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డ్వామా పీడీ పి.రాము పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో సర్వర్ల సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

రేషన్ సర్వర్ల మొరాయింపుతో ప్రజలు పడుతున్న ఇక్కట్లను తీర్చేదెవరని, ఆపరేటర్లపై ఒత్తిని తగ్గించేదెవరని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రశ్నించారు. జిల్లాలో పోస్ట్‌మిషన్‌లో వేలిముద్రలు పడక రేషన్‌కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్‌డియు వాహనదారులైన ఆపరేటర్లు ప్రజల నుండి ఒత్తిడి ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించి రేషన్‌కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని, ఎమ్‌డియు వాహన ఆపరేటర్లపై ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో ఎమ్‌డియు వాహనాలు తీసుకువచ్చి రేషన్ సరుకుల పంపిణీ చేపట్టిందని, ఇందులో భాగంగా రేషన్ కార్డుదారులు పోస్ట్ మిషన్‌లో తమ వేలిముద్ర వేసి రేషన్ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి కార్డుదారులతోపాటు ఆపరేటర్లు కూడా వేసి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఎన్నికల సమయంలో మీరు రేషన్ డిపోల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, తమ ప్రభుత్వం రాగానే ఇంటి వద్దకే రేషన్ సరుకులు తీసుకొచ్చి ఇస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నేరవేరలేదన్నారు. ఎమ్‌డియు వాహనాలతో అందుబాటులోకి రేషన్ తీసుకువచ్చినా బియ్యం, పంచదార మాత్రమే రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసి ఇతర నిత్యావసర సరుకులు ఎత్తివేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు బియ్యం, పంచదారతో పాటు ఇతర నిత్యావసర సరుకులు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేషన్ కార్డుదారులు పేదవారని, వారు రోజు కూలీకి వెళితేగాని పొట్టనిండదని, ఈ పరిస్థితుల్లో రేషన్ వాహనం వచ్చినప్పుడు తమ పనులు మానుకుని జగన్ ఇచ్చే బియ్యం, పంచదార కోసం ఎదురుచూడాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పుడు సర్వర్లు మొరాయించడంతో తమ రోజువారీ పనులకు కూడా వెళ్లకుండా పేదలు రేషన్ కోసం ఎండల్లో వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రేషన్ తీసుకోకపోతే కార్డులు తొలగిస్తారని, ప్రభుత్వ పథకాలు అందవనే భావనను రాష్ట్ర ప్రభుత్వం పేదల్లో కలిగించారని దీనితో తమ ఉపాధిని కూడా వదులుకుని పేదలు రేషన్ కోసం పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. పత్రికల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం జీలుగుమిల్లిలో సర్వర్ పనిచేయ కపోవడంతో సరుకులు సరఫరా చేసే వాహనాన్ని నిలిపివేశారని, పి.రాజవరంలో కేవలం 20 శాతం మందికి మాత్రమే రేషన్ అందించారని, ముదినేపల్లి మండలంలో రేషన్ పంపిణీ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, కలిదిండి మండలం లోని రెండు గ్రామాల్లో రేషన్ పంపిణీ జరగలేదని, బుట్టాయ గూడెం మండలంలో ఐదు రోజుల నుండి వాహనాలు నిలిచిపోయి రేషన్ పంపిణీ ఆగిపోయినట్లు తెలిసిందని పేర్కొన్నారు. మరోపక్క ఎమ్‌డియు ఆపరేటర్ల కష్టాలు మరింత దారుణంగా ఉన్నాయన్నారు. ఎమ్‌డియు వాహన టైర్లు పంక్చర్ పడటం, డోర్లు ఊడిపోవడం, లైట్లు వెలగకపోవడం, వాహనంలో బరువు మిషన్, ఈ పోస్ట్ మిషన్‌కు సంబంధించి ఛార్జింగ్ పెట్టుకునేందుకు వైరింగ్ రిపేర్లతో పాటు చిన్నచిన్న రిపేర్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి జీతంతోనే చేసుకోవాల్సి వసుతందని, దీంతో మిగిలేది లేక చాలా మంది ఆపరేటర్లు మానేస్తున్నారని తెలిపారు.

నేడు భీమడోలులో జగనన్నకు చెబుదాం

ఏలూరు: ఈనెల 11వ తేదీన భీమడోలులో మండలస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వారంలో బుధవారం, శుక్రవారం మండలస్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమ నిర్వహణలో భాగంగా భీమడోలు మండల ప్రజల కోసం ఈనెల 11వ తేదీన ఏర్పాటు చేశామన్నారు. కొవ్వూరు వెళ్లే రోడ్డులో భీమడోలు జంక్షన్ వద్ద గల కాట్రగడ్డ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

పేదల పట్ల నిరంకుశ వైఖరి తగదు : వ్యకాస

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. అసైన్డ్ చట్ట సవరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని, భూ పంపిణీలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను చేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏలూరు వసంతమహల్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేస్తామని ప్రకటించి అసైన్డ్ భూముల చట్ట సవరణ చేయడం దుర్మార్గమన్నారు. 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకపోగా ఈ చట్ట సవరణ ద్వారా 20 ఏళ్లు ఎవరైతే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో వారికే పట్టాలిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. కాకులను కొట్టి గద్దలకు పెట్టినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పేదల చేతుల్లో ఉన్న భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు, దళితులకు, గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్ల నుండి ప్రభుత్వ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా భూములమ్మేసిన భూస్వాములే సాగు చేస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పేదలకు అన్యాయం చేస్తూ భూస్వాములిచ్చే లంచాలు మింగి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు కోసం ఇప్పటి ప్రభుత్వం సుమారు 3500 ఎకరాలు భూసేకరణ చేసిందన్నారు. ఈ భూముల్లో సుమారు మూడు వేల ఎకరాలు మిగులుగా ఉందని ఆ భూములు ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పేదలకు సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనితోపాటు ఏక్‌సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులపైన ఇరిగేషన్ అధికారులు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. చట్టాలు ధిక్కరించే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, నూజివీడు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పేదల భూములు ఆక్రమణలో ఉన్నాయని, ఆక్రమించుకున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి మండలాల్లో వందలాది ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, టి.ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, సహాయ కార్యదర్శి యు.వెంకటేష్, రాజమండ్రి దానియేలు, ఎం.సుధారాణి సత్యనారాయణ, మాధవ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కండక్టర్ పై దాడి

నూజివీడు రూరల్: ఆర్‌టిసి కండక్టర్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన నూజివీడు పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఎంవిఎస్.ఆచార్యులు(50) నూజివీడు డిపోలో ఆర్‌టిసి కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఎర్రగొండపాలెం సర్వీస్‌కు డ్యూటీ నిమిత్తం ఉదయం బయలుదేరాడు. బస్టాండ్ సమీపంలోని శివాలయం వద్దకు రాగానే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్‌లతో దాడి చేసి అక్కడ నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన ఆచార్యులుని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నూజివీడు రూరల్ : రావిచెర్ల గ్రామంలో ఎంపియుపి పాఠశాలను ఎంఈఒ-2 ఎస్.జమలయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యంపై ఆరా తీశారు. ఏజెన్సీ నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ఏలూరు అర్బన్ : వలసల నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణమే ప్రారంభించాలని కోరుతూ అక్టోబర్ 17వ తేదీన అనంతపురం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని బికెఎంయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కూలీలు, పేదలు, రైతులు, చేతి వృత్తుల వారు ఈ సదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మండవల్లి గ్రామసభ వాయిదా

మండవల్లి : మండలకేంద్రమైన మండవల్లి గ్రామసభ మంగళవారం వాయిదా పడింది. గ్రామసభలో హాజరు కావాల్సిన కార్యదర్శి సెలవుపై వెళ్లడంతో పాటు అధికారులు గ్రామసభకు రాకుండా డుమ్మా కొట్టారు. దీంతో కార్యదర్శి, అధికారులు రానప్పుడు గ్రామసభ నిర్వహించడం ఎందుకని గ్రామ ప్రజలు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు సర్పంచి, ఇన్‌ఛార్జి కార్యదర్శిపై ధ్వజమెత్తారు. దీంతో తప్పని పరిస్థితుల్లో సర్పంచి 12 గంటల సమయంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజలు శాంతించారు. వాయిదా వేసిన గ్రామసభలో ఉపసర్పంచి జొన్నలగడ్డ నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ హనుమ, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, ఎల్ఎస్ భాస్కరరావు, పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పనుల గుర్తింపు : ఎపిఒ

పోలవరం : రాబోయే ఆర్థిక సంవత్సరం 2024 - 2025 చేపట్టబోయే పనుల ప్రణాళికా ప్రక్రియలో భాగంగా పనులను గుర్తించడానికి గ్రామస్థాయి టీంలు వేశామని, వారు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పనులు గుర్తింపు కావాల్సి ఉంటుందని ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపిడిఒ జి.శ్రీను ఆధ్వర్యంలో జరిగిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి సంబంధించి హాఫ్ డే ఓరియంటేషన్ ప్రోగ్రాంను మండల సమైక్య ఆవరణలో నిర్వహించామని వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ టీంలు నవంబర్ లోపు గ్రామీణ ఉపాధి హామీలో చేపట్టిన పనులను గ్రామస్థాయిలో గుర్తించాలని టీంలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ టిఎలు, ఎఫ్ఎలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

13 నుంచి ప్రత్తిపాడు రైల్వే గేటు మూసివేత

మండవల్లి : రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ప్రత్తిపాడు రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ ఇంజనీర్ ఎం.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపాడు రైల్వే గేటు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులకు నోచుకుందన్నారు. మరమ్మతులు నిర్వహించే విధంగా ప్రత్తిపాడు వెళ్లే 76వ గేటును ఈనెల 13 శుక్రవారం నుంచి 17 మంగళవారం వరకు మూసివేస్తున్నట్లు ఆయన తెలిపారు. 17 సాయంత్రం నుంచి తిరిగి రాకపోకలు సాగించేలా గేటును తెరుస్తామని ఆయన తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు రైల్వేకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించాలని ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలి

చింతలపూడి : ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర తెలిపారు. పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బంది కార్యాలయని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, డిప్యూటి తహశీల్దార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

ఆగిరిపల్లి : మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన మంచినేని వెంకటేశ్వరరావు(24) కనబడుట లేదని అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన మంచినేని వెంకటేశ్వరరావు ఇంటి వద్దనే వర్క్ ఫ్రం హోం చేస్తున్నట్లుగా తెలిపారు. సోమవారం గన్నవరం మండలం, చిక్కవరం గ్రామానికి వెళ్లిన వెంకటేశ్వరరావు అచూకి కనుపడుట లేదని, అచూకీ తెలిసిన వారు 9440796444 నెంబరుకు సమాచారం అందజేయవలసినదిగా ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలికి చెందిన వీరమళ్ల శివరాజు(32) ఏలూరులోని ఓ షాపింగ్ మాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై విధులకు హాజరయ్యేందుకు ఏలూరు వస్తున్నాడు. మార్గమధ్యంలో పాతూరు శివారు ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో వాహనం నడుపుతున్న శివరాజుకు తలకు, ఛాతీకి తీవ్రగాయాలు కాగా వెనుక కూర్చున్న గణేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరిని హైవే అంబులెన్సు పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి శివరాజు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీనిపై అత్తిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుక్కలు దాడి : విద్యార్థికి తీవ్రగాయాలు

ముదినేపల్లి : కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసిన ఘటనలో విద్యార్థినికి తీవ్రగాయాలైన సంఘటన ముదినేపల్లిలో సోమవారం జరిగింది. అంబేద్కర్ కాలనీకి చెందిన శేవా అక్షయ(16) స్థానిక వికాస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వెళ తున్న సమయంలో వీధికుక్కలు గుంపులుగా వచ్చి అక్షయపై దాడి చేశాయి. ఈఘటనలో అక్షయ దుస్తులు చినిగిపోవడంతో పాటుగా శరీరంపై తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కావలెను
ప్రజాశక్తి దినపత్రికకు దిగువ కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఏలూరు కల్చరల్, ఏలూరు సిటీ, భీమవరం టౌన్, తాడేపల్లిగూడెం టౌన్, నరసాపురం అర్బన్, తణుకు టౌన్, నూజివీడు టౌన్
రూరల్ : జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, వేలేరుపాడు, కుక్కునూరు, కెఆర్.పురం ఐటిడిఎ, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు
విద్యార్హత: ఇంటర్
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఎడివిటి ఇన్‌ఛార్జి: నూజివీడు
మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
ఇంటర్వ్యూ తేదీ:
14-10-23 శనివారం ఉదయం పది గంటలకు
ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్స్
సెల్: 9949366196, 8919170815, 9490099168

క్రికెట్ బెట్టింగుల నివారణకు చర్యలు

గతంలో కేసులు నమోదైన వారికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రపంచ కప్ క్రికెట్ పోటీల నిర్వహణ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్లు నివారించేందుకు ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఏలూరు నగరంలోని త్రీటౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల వద్ద గతంలో క్రికెట్ బుకీలు నిర్వహించి, కేసులు నమోదైన వారు, క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన వారిని మంగళవారం పోలీస్ స్టేషన్లకు పిలిపించి త్రీటౌన్ సిఐ కోమాకుల శివాజీ, టూటౌన్ సిఐ చంద్రశేఖర్ తమ పోలీసు స్టేషన్ల వద్ద వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్ ముందు హాజరు పరిచి, వారిపై బైండోవరు కేసులు నమోదు చేయించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత : ఎంఎల్ఎ

రూ.50 లక్షలతో పబ్లిక్ హెల్త్ బ్లాక్ యూనిట్ నిర్మాణం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు తెలిపారు. పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షల వైద్య ఆరోగ్యశాఖ నిధులతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ బ్లాక్ యూనిట్ నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లక్ష్యానికి మించి ప్రసవాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రసవాలకు వచ్చేవారు వేచి ఉండేందుకు, వారికి అవసరమైన వైద్య సేవలు, వైద్యులను అందుబాటులో ఉంచేందుకు కలెక్టర్ పిహెచ్‌సికి అనుబంధంగా పబ్లిక్ హెల్త్ బ్లాక్ యూనిట్‌ను మంజూరు చేశారన్నారు. నిర్మాణ పనుల బాధ్యతలను గృహనిర్మాణ సంస్థకు అప్పగించారని తెలిపారు. ఇదే క్రమంలో పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సహకరించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పై అంతస్తులో అదనపు ప్రసూతి వార్డు, గర్భిణీలు వేచి ఉండేందుకు అవసరమైన అదనపు నిర్మాణాలను రూ.7.5 లక్షల కరోనా నిధులతో నిర్మించేందుకు అనుమతి లభించిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ లీలా ప్రసాద్ మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో నెలవారీ ఐదు ప్రసవాలు చేయడం లక్ష్యం కాగా, సరాసరి ఆరుకి తక్కువ కాకుండా ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎంఎల్ఎ చొరవతో పిహెచ్‌సికి మంజూరైన అదనపు నిధులు, సమకూరిన మౌలిక వసతులతో మరింత ఎక్కువ సంఖ్యలో సుఖ ప్రసవాలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్, జడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనుమాల రామయ్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, సంస్థ గృహ నిర్మాణ సంస్థ డిఇఇ, సహాయ ఇంజనీర్ సోమేశ్వరరావు, సతీష్, పూళ్ళ సొసైటీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మానసిక వికలాంగులను చులకన భావంతో చూడకూడదని, వారి పట్ల సానుభూతి, సహాయ సహకారాలు అందించాలని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సి.మధుబాబు కోరారు. ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంపియుపి పాఠశాలలో భవిత ప్రత్యేక అవసరాల గల పిల్లల శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పిల్లల తల్లిదండ్రులకు, టీచర్స్‌కు మానసిక, శారీరక వికలాంగులకు ఉన్న హక్కుల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హాఫీజా మాట్లాడుతూ మానసిక రోగం అనేది తగ్గేదేనని, దానికి కుటుంబ సభ్యుల సహకారం, సమాజం సహకారం ఉండాలని తెలిపారు. మానసిక వికలాంగులకు న్యాయ సేవల ద్వారా వారికి మెరుగైన వైద్యం ఇప్పించవచ్చన్నారు. అలాగే వారికి సంబంధించిన ఆస్తుల విషయంలో కూడా వారికి న్యాయ సహకారాలు అందిచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్కపాము వెంకట చైతన్య, పింగుల డేవిడ్ రాజు, బుల్లా ఏసుపాదం, సోషల్ వర్కర్ ఎమ్‌డి అక్బర్ అలీ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హాఫీజా, మండల విద్యాధికారి, రామరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలరాజు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చింతలపూడి భవితా కేంద్రాన్ని సందర్శించిన న్యాయమూర్తి మధుబాబు

ముసునూరు : ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా, మానసికంగా ఆనందంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం.హన్నమణి, ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని సైకియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. నేడు ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న సమస్య మానసిక ఒత్తిడన్నారు. అనంతరం సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మన ఆలోచనలు, ఆచరణలూ అన్నీ మెదడుపైనే ఆధారపడి వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ కెసిహెచ్.వీర్రాజు, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గణిత శాస్త్రంపై అంతర్జాల ఉపన్యాసం

జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గణితశాస్త్రంపై అంతర్జాలంలో అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేయడం హర్షణీయమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక చత్రపతి శివాజి త్రి శతజయంతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన గణితశాస్త్ర విభాగంలో శ్రీవెంకటేశ్వర కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దేవకి అంతర్జాలంలో అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా భౌతిక, రసాయన శాస్త్రాల్లో అవకలన, సమీకరణాల, అనువర్తనాలు అను అంశాలను విద్యార్థులకు వివరించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.బదరినారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూ ఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్, జె.రాజా, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

14 నుంచి 24 వరకు పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

పాఠశాలలకు దసరా సెలవుల నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా వివిధ శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పలు కార్యక్రమాలను చేపట్టనుందని సంస్థ కార్యదర్శి తెలిపారు. దసరా సెలవులలో విద్యార్థులకు గ్రంథాలయాలకు వచ్చే అలవాటు చేయటం, గ్రంథాలయాల ద్వారా వారికి అందే సేవలు పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులలో వినే నైపుణ్యాలు పెంచేందుకు కథలు వినటం, చదవటం మా కిష్టం కార్యక్రమాన్ని రెండు దశలుగా నిర్వహించే క్రమంలో విద్యార్థులు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను చదవడం, కథలను చెప్పటం కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యార్థులు చదివిన పుస్తకాలపై ప్రముఖుల పర్యవేక్షణలో పుస్తక సమీక్ష చేయించడం ఉంటుందన్నారు. వీటికి అదనంగా రోజువారి కార్యక్రమాలను నిర్వహించే చివరి గంట సమయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం ఇతర అంశాలలో విద్యార్థుల ఆసక్తి మేరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. ఇదే క్రమంలో గ్రంథ పాలకులు గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయడంతో పాటు, సభ్యత నమోదు కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన ఆదేశించారు.

మెరుగైన వైద్యసేవలందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' లక్ష్యం

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు ఉచితంగా ఇంటి వద్దకు అందించి, ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ చెయ్యాలనే లక్ష్యంతో సిఎం జగన్ పని చేస్తున్నారని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక రహదారి భవనంలో మంగళవారం కైకలూరు-2 గ్రామ సచివాలయ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలసి ఆయన పాల్గొని పలు విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి కురేళ్ల బేబీ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి, ఎంఆర్‌ఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఏలూరులోని శిబిరంలో ఒపి వివరాలను తెలియజేస్తున్న డా.ఎస్.శర్మిష్ట

నూజివీడు రూరల్ : మండలంలోని హనుమంతుల గూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ కృష్ణంరాజు, ఎంపిపి ఆరేపల్లి శిరీష, ఎంపిడిఒ, తహశీల్దార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పేదలకు ప్రత్యేక వైద్యం అందించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు జెడ్‌పిటిసి మల్లం వసంతరావు తెలిపారు. శనివారం మండలంలోని అంకన్నగూడెం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, తహశీల్దార్ సుందర్‌సింగ్, స్పెషలిస్ట్ డాక్టర్‌లు నాగదేవి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని అచ్చియ్యపాలెం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపిపి గగ్గులోతు మోహన్‌రావు, కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అరేటి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాజీ, స్థానిక సర్పంచి కుంజా వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పోలవరం : పాత పట్టిసీమ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను ఎంపిపి, మండల తహశీల్దార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుబ్బారావు శ్రీరామ్ మూర్తి, తహశీల్దార్ బి.సుమతి, ఎఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, ఎంపిటిసి ఆకుల వరలక్ష్మి, ఆకుల బుజ్జి, సూర్యచంద్రం, పంచాయతీ సెక్రటరీ తాతి విజయ కుమారి పాల్గొన్నారు

ముసునూరు : జగన్ పరిపాలనలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ఆయన లక్ష్యమని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. మంగళవారం మండలంలోని గోపవరంలో సర్పంచి కంచర్ల వాణి ఆధ్వర్యంలో ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు పాల్గొన్నారు.

మండవల్లి : రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతోనే సిఎం జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారని వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు స్పష్టం చేశారు. మండలంలోని లింగాలలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లినగరం సర్పంచి వీరబాబు, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా తెలిపారు. మండలంలోని మర్రిగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, సర్పంచి సోయం బిందు, ఎంపిడిఒ మంగాకుమారి, ఎంఇఒ కళ్యాణి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : 25 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో సాయంత్రం 5 గంటల వరకు 7 వేల 904 మందికి ఒపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరికి ఉచితంగా మందులు అందించామన్నారు. తాపీమేస్త్రీ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 172 ఒపి నమోదు అయ్యారని తెలిపారు.

కలిదిండి : మండలంలోని తాడినాడ గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కూసంపూడి కనక దుర్గారాణి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి

ముదినేపల్లి : స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి.విశ్వనాధ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే తీరుతెన్నులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ పరిశీలన

ఏలూరు టౌన్ : వ్యాపారులు రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం వన్ టౌన్ ప్రాంతంలోని చేపల మార్కెట్‌లో సుడిగాలి పర్యటన చేపట్టి మార్కెట్ ప్రాంతంలోని అన్ని షాపులను పరిశీలించారు. అక్కడ వ్యాపారులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ ప్రాంతంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో డిఇ పిలగల కొండలరావు కమిషనర్ వెంట ఉన్నారు.

'చంద్రబాబునాయుడుపై కేసులు కొట్టివేయాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు పెట్టి కక్ష్య పూరితంగా అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని టిడిపి చింతలపూడి నియోజకవర్గ నాయకులు బొమ్మాజి అనిల్ తెలిపారు. మంగళవారం టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బొమ్మాజి అనిల్ మాట్లాడుతూ 73ఏళ్ల వయసులో చంద్రబాబు నాయుడుని మానసికంగా హింసిస్తున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి చేసిన సేవను ప్రజలు మరువరన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు దాసరి శేషు, కొండ్రెడ్డి కిషోర్, ఆకుమర్తి రామారావు, చిట్టిబోయిన రామలింగేశ్వరావు, చిట్రోజు తాతాజీ, గెడా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మంగళవారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో రిలే నిరహార దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచి కాటేపల్లి సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు కాటేపల్లి వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కాటేపల్లి ప్రసాదు, బాసరపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు వేంపాటి శ్రీనివాసరావు, వేంపాటి సత్యనారాయణ, లక్కపాము కాంతారావు, పలువురు టిడిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ 'బాబు కోసం మేము సైతం' అంటూ టిడిపి, జనసేన ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర నాయకులు తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్, గోపాలపురం నియోజవర్గం నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నూజివీడు రూరల్ : మండలంలోని మీర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ యూత్ ఫెస్టివల్ 2023లో భాగంగా జిల్లాస్థాయిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిలు జి.త్రివేణి, ఎల్.జాసియ రాణి ప్రోత్సాహక బహుమతులు పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు డివిఎల్.పుష్పలత తెలిపారు. ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ధ్రువపత్రాలతో పాటు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహం అందించారని తెలిపారు. గైడ్ టీచరుగా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయిని బి.అరుణను అభినందించారు.

మినీ జాబ్ మేళాలో 37 మంది ఎంపిక

బుట్టాయగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మినీజాబ్ మేళాకు 108 మంది యువత హాజరైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. 37 మంది వివిధ కంపెనీలలో ఉపాధి పొందగా, 29 మంది మొదటి రౌండ్ పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వైపి.ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపల్ భక్త హనుమాన్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి : వైఎస్ఆర్ బీమా పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు పల్లగాని నరశింహారావు తెలిపారు. మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి, గొల్లగూడెంలో ఇటీవల జువ్వనబోయిన రాంబాబు అనారోగ్యంతో చనిపోగా, అతని భార్య అయిన జువ్వనబోయిన కాసులుకు వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల క్రింద మంజూరైన రూ.10 వేల నగదును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జె.జమలయ్య, చిన్ని రాంబాబు, కిరణ్ పాల్గొన్నారు.

ఆటోనగర్ సంఘం ఎన్నికలు తక్షణమే ఆపాలి

ఏలూరు టౌన్ : ఏలూరు ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్‌కు కొందరు అసంబద్ధంగా, నిబంధనలకి విరుద్ధంగా నిర్వహిస్తున్న ఎన్నికలను నిలుపుదల చేయాలని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం డిమాండ్ చేశారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌కు అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఎక్కడా నిబంధనలు పాటించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నం. 256/2023
పసుపులేటి మౌనిక వగైరా ...వాదులు
మరియు
పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి: సూర్యనారాయణ, డో.నెం.16-13, రామచంద్రరావుపేట, పెనుగొండ, పెనుగొండ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...ప్రతివాది
పై నెంబరు దావాలో వాదులు పసుపులేటి మౌనిక మరియు పసుపులేటి సోహిత్ గార్లు ఏకస్తులై ప్రతివాది వారి తండ్రి గారు అయిన పసుపులేటి శ్రీనివాసరావు తండ్రి: సూర్యనారాయణ గారి పై కుటుంబ ఆస్తి పంపకం నిమిత్తం ఓ.యస్.నం. 256/2023 దావాను ధాఖలు చేయగా సదరు ప్రతివాది పసుపులేటి శ్రీనివాసరావు సమను అందుకోకుండా తప్పించుకొను చున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశాలు ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. సదరు ప్రతివాది పసుపులేటి శ్రీనివాసరావు **ది.19-10-2023 సం॥రం తేదీన ఉదయం 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరై మీ అక్షేపణలు విన్న వించుకోవలెను.** లేని యెడల మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.
వెలిచేటి గోవిందారావు
వాదులు తరపు న్యాయవాది
తణుకు, తణుకు, ప॥గో॥జిల్లా.
10-10-23. సెల్: 98491 22938

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 25/2018
ఇన్ ఓ.యస్.నెం. 149/2013
బిట్వీన్:
సత్తి రజనీకుమార్ రెడ్డి ...పిటీషనరు /డి.హెచ్.ఆర్
మరియు
రెడ్డి సూర్యచంద్రరావు వగైరా ...రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్
పై నెంబరు డిక్రీ బాకీకి గాను రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్ కు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గలట్టి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.30-10-2023 సం॥రం తేదీ ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ పై కోర్టు వారి ఎదుట వేలం వేయుదురు.** గాన పాడుకొనదలచిన వారు శ్రీ కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.
షెడ్యూలు ఆస్తి వివరము
పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట పంచాయితీ లోని ఆర్.యస్.నెం. 1218రులో య.1-00ట్లు తాడేపల్లిగూడెం సబ్ డివిజన్‌లోని ఆస్తికి హద్దులు: **తూర్పు:** విక్రయదారుగారి ఆర్.యస్.నెం. 1218లో మిగిలిన ఆస్థి. **దక్షిణం:** సుంకవల్లి భాస్కరరావు గారి భూమి. **పడమర:** ఆర్.యస్.నెం. 1215లో కొండ్రెడ్డి ప్రసన్న కుమార్ గార్కి అమ్మిన భూమి. **ఉత్తరం:** ఏలూరు కాలువ.
పై హద్దుల మధ్య య. 1-00ట్లు జిరాయితీ భూమికి సమస్త ఈజ్‌మెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ విలువ : రూ.12,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.14,00,000/-
పి.ఆంజనేయరాజు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 98480 18256